క్లుప్తంగా

చల్లపల్లిలో జాతర



చల్లపల్లిలో మహిషాసురమర్దిని అమ్మవారు

ఉప్పలగుప్తం: చల్లపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న మహిషాసురమర్దిని అమ్మవారి జాతర మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. అలాగే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు సమర్పించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విద్యుత్ కాంతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

అభివృద్ధి ప్రణాళికపై ముగిసిన శిక్షణ



ఐ.పోలవరంలో శిక్షణ పొందిన ప్రజాప్రతినిధులతో అధికారులు

ఐ.పోలవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక శిక్షణ శుక్రవారంతో ముగిసిందని ఎంపీడీఓ టి.చైతన్య భరత్‌రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ముందస్తు ప్రణాళిక ఎంతో అవసరమన్నారు. దీనిలో సర్పంచులు, వార్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ, మండల పరిషత్ అధికారులు భాగస్వాములు కావాలని కోరారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ ప్రణాళిక తయారు చేసే ముందు గ్రామాల్లో స్థితిగతులను పరిశీలించాలన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

స్థానికులకే ఇళ్ల స్థలాలు కేటాయించాలి

తాళ్లరేవు: చొల్లంగిలోని సాల్ట్ భూముల్లో ఇళ్ల స్థలాలను స్థానికులకే కేటాయించాలని కోరుతూ శుక్రవారం ప్రజలు ఆందోళన చేశారు. ఇక్కడి 4.24 ఎకరాల భూమిని ఉప్పలంక ప్రజలకు కేటాయించడం సరికాదని నాయకులు కట్టా త్రిమూర్తులు, గర్రే లక్ష్మీనారాయణ, కనకాల పెదబాబు, వారా సూర్యకుమారి అన్నారు. అనంతరం తహసీల్దార్ ఎస్.పోతురాజుకు వినతిపత్రం అందజేశారు.

వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి విరాళాలు



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ అవరణలో నిర్మిస్తున్న వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి పలువురు విరాళాలు ఇచ్చారు. కొయ్యలగూడేనికి చెందిన నాటకసాల వెంకటరాజు, సత్యవతి దంపతులు రూ.60,116, విశాఖపట్నానికి చెందిన టి.శేషుకుమార్, లక్ష్మి దంపతులు రూ.25 వేలు, మూలస్థానానికి చెందిన యూఎల్ఎం వెంకట సూర్యప్రకాష్ రూ.21,720 విరాళం అందించినట్టు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారయణరాజు తెలిపారు. దాతలకు ఆలయ సిబ్బంది చేతుల మీదుగా స్వామి వారి చిత్రపటాలు అందజేశారు.

వేధింపులపై ఫిర్యాదు

అయినవిల్లి: స్థానిక పీహెచ్‌సీకి చెందిన ల్యాబ్ టెక్నీషియన్ తనను వేధిస్తున్నాడని విలస సబ్ సెంటర్ ఎంఎల్‌హెచ్‌పీగా పనిచేస్తున్న మహిళ అయినవిల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. దీనికి సంబంధించి ఎస్సై కె.సురేష్ బాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని విలస గ్రామ సబ్‌సెంటర్‌లో ఎంఎల్‌హెచ్‌పీగా పనిచేస్తున్న మహిళను అయినవిల్లి పీహెచ్‌సీలో ల్యాబ్‌టెక్నీషియన్ పని చేస్తున్న కడలి శ్రీనివాస్ ప్రేమిస్తున్నానంటూ వేధింపులకు గురి చేశాడని, అసభ్యపదజాలంతో దూషించాడని తన సెల్ ఫోన్ వాట్సాప్‌కు అసభ్యకరమైన మెసేజ్‌లు పంపించాడని అయినవిల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనకు ఇటీవల పెళ్లినిశ్చితార్థమైందని చెప్పినా వేధింపులు ఆపలేదని ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

హరిదాసుకు సత్కారం

రాజోలు: ధనుర్మాసం ప్రారంభం నుంచి ఊరూరా తిరుగుతూ సంకీర్తనలు ఆలపిస్తూ జీవనం సాగించే హరిదాసును శుక్రవారం రాజోలు నాగార్జున స్ట్రీట్ బాల బాలాజీ సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆధునిక సమాజంలో అంతరించిపోతున్న సంస్కృతీ, సాంప్రదాయాలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని సంఘ నాయకుడు గుబ్బల శ్రీనివాస్ అన్నారు.

పదింతల ప్రణాళికతో..

- టెన్త్ విద్యార్థులకు అదనపు తరగతులు
- రోజుకొక సబ్జెక్టుపై పరీక్షల నిర్వహణ
- జగనన్న విద్యాభారతి పేరుతో స్టడీ మెటీరియల్ పంపిణీ



తాళ్లరేవు హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ

తాళ్లరేవు: విద్యార్థి భవిష్యత్తుకు 'పది' పునాది.. ఈ తరగతిలో సాధించే మార్కుల ఆధారంగానే వారి చదువుకు మంచి బాట పడుతోంది.. అందుకే ప్రభుత్వ బడుల్లో పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రభుత్వం పటిష్ట ప్రణాళిక అమలు చేస్తోంది. పరీక్షలకు సమయం దగ్గర పడుతుండటంతో రోజూ ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు నిర్వహించి మెరుగైన ఫలితాలే లక్ష్యంగా విద్యాశాఖ కార్యాచరణ చేసింది. ముమ్మిడివరం నియోజకవర్గంలో ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ల నుంచి మొత్తం 15,499 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. ఐ.పోలవరం మండలంలో 3,640, ముమ్మిడివరం మండలంలో 4,800, తాళ్లరేవు మండలంలో 1,259, కాట్రేనికోన మండలంలో 5,800 మంది విద్యార్థులు ఉన్నారు. వీరంతా సిలబస్‌పై పట్టు సాధించి మంచి మార్కులు పొందే విధంగా శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే సిలబస్ పూర్తి చేయగా, పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక తర్ఫీదు అందిస్తున్నారు. పరీక్షలంటే భయం వీడేలా రోజూ ఓ సబ్జెక్టుపై పరీక్ష నిర్వహిస్తూ వారిలో ధైర్యం నింపుతున్నారు. ప్రైవేట్ స్కూళ్ల కంటే మెరుగైన ఫలితాలు సాధించేందుకు సర్కారు బడుల్లో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. ఇప్పటికే విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి కౌన్సెలింగ్ ఇచ్చారు. తమ పిల్లలను ఇంటి వద్ద కూడా చదివించాలని, వారికి ఏ మేరకు సౌకర్యాలు కల్పించాలో తెలిపారు. ఇదిలా ఉంటే టెన్త్ విద్యార్థులు సులువుగా పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు ప్రభుత్వం జగనన్న విద్యా భారతి పేరుతో స్టడీ మెటీరియల్ అందజేసింది. జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులందరికీ మెటీరియల్ ఇప్పటికే పంపిణీ చేసింది. తాళ్లరేవు మండలంలో ఈ మెటీరియల్‌ను ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్, సర్పంచులు, విద్యా కమిటీ చైర్మన్ల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు.

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



ఈ ఏడాది 'పది'లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. దీనికోసం రోజూ ఉదయం గంట, సాయంత్రం గంట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. సబ్జెక్టుల్లో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నాం. టైం టేబుల్ ప్రకారం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

–ఓలేటి కుమార్‌శ్రీ ఉపాధ్యాయుడు, పి.మల్లవరం జెడ్పీ హైస్కూల్

గ్రేడుల వారీగా విభజించి..



పరీక్ష విధానంలో ప్రభుత్వం కొన్ని మార్పులు తీసుకువచ్చింది. ఇప్పటికే వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించాం. గతంలో ఒక్కో సబ్జెక్టుకు రెండు పరీక్షలు జరిగేవి. ఇప్పుడు మొత్తంగా ఏడు పరీక్షలు రాయాల్సి ఉంటుంది. పరీక్షల విధానంపై అవగాహన కల్పించేలా రోజుకొక సబ్జెక్టుపై పరీక్ష నిర్వహిస్తున్నాం. గ్రేడుల వారీగా విద్యార్థులను విభజించి తర్ఫీదు ఇస్తున్నాం.

–పుల్లేటి కిశోర్, సైన్స్ ఉపాధ్యాయుడు, తాళ్లరేవు జెడ్పీ హైస్కూల్

పరీక్షలంటే భయం పోయింది



రోజూ చెప్పే పాఠాలతోపాటు ఉదయం, సాయంత్రం నిర్వహించే ప్రత్యేక తరగతుల్లో సందేహాలన్నీ నివృత్తి చేస్తున్నారు. ఉదయం చదివించి సాయంత్రం పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీనిద్వారా పరీక్షలంటే భయం పోయింది. వెనుకబడిన సబ్జెక్టుల్లో ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ప్రభుత్వం అందించిన జగనన్న విద్యాభారతి స్టడీ మెటీరియల్ చాలా బాగుంది.

–కురుపూడి జ్యోత్స్న, పదో తరగతి విద్యార్థిని, తాళ్లరేవు

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో ప్రజలకు మేలు



ఆరోగ్య సురక్ష కిట్లు అందిస్తున్న సర్పంచ్ సాయికృష్ణ

అల్లవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందని సర్పంచ్ సుందరనీడి సాయికృష్ణ అన్నారు. సామంతకుర్రులో శుక్రవారం ఆయన అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దఫా కార్యక్రమం నిర్వహించారు. బెండమూర్లంక పీహెచ్‌సీ వైద్యాధికారి శాంతిప్రియ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. జేసీకే చైర్మన్ తిక్కా వెంకటప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు చెదళ్ల వాసుదేవుడు, కొనుకు మహేష్, కొల్లు నాగేశ్వరరావు, ఎంపీడీఓ కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: కామనగరువు సచివాలయం–2లో పరిధి సృజన కాన్వెంట్ వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షురాలు సర్పంచ్ నక్కా అరుణకుమారి ప్రారంభించారు. పలు వ్యాధులు, కంటి సమస్యలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, కార్యదర్శి అడబాల రాజశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు తరలిన జనం



విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద అమలాపురం వైఎస్సార్ సీపీ నాయకులు



తాళ్లరేవులో సుంకరపాలెం జంక్షన్ నుంచి తరలి వెళుతున్న నాయకులు

అమలాపురం టౌన్: దేశం గర్వించేలా విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్మించిన 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, స్మృతి వనం ప్రారంభోత్సవాలను కనులారా వీక్షించేందుకు అమలాపురం నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లారు. నియోజకవర్గం నుంచి సుమారు నాలుగు వేల మంది శుక్రవారం ఉదయమే విజయవాడకు బయలుదేరారు. వైఎస్సార్ సీపీ దళిత నాయకులు, కార్యకర్తలు, పార్టీలకు అతీతంగా అంబేడ్కర్ అభిమానులు తరలివెళ్లారు. ప్రభుత్వం తరఫున కలెక్టర్ హిమాన్షు శుక్లా జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 116 ప్రత్యేక బస్సుల్లో అభిమానులు వెళ్లారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ ఆధ్వర్యంలో జనం విజయవాడ బాట పట్టారు. నియోజకవర్గంలో అమలాపురంతోపాటు 60 గ్రామాల నుంచి జనంతో ప్రత్యేక వాహనాలు వెళ్లాయి. జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్, పార్టీ ఎస్సీ నాయకులు ఉండ్రు బాబ్జి, ఈతకోట శ్రావణ్‌కుమార్, చింతా రవికుమార్, ఉండ్రు వెంకటేష్, మెండు రమేష్‌బాబు తదితరులు ఉన్నారు.



ముమ్మిడివరం నుంచి విజయవాడ వెళ్లిన అంబేడ్కర్ అభిమానులు, పార్టీ శ్రేణులు

ముమ్మిడివరం: మండలం నుంచి విజయవాడలో సామాజిక సమతా సంకల్ప సభకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అభిమానులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ముమ్మిడివరంలో ఈ కార్యక్రమాన్ని పలువురు నాయకులు జెండా ఊపి ప్రారంభించారు. నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, పెయ్యల చిట్టిబాబు, ఢిల్లీ నారాయణ, కాశి జగపతి తదితరులు ఉన్నారు.

అల్లవరం: అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి మండలం నుంచి 150 మంది వెళ్లారని ఎంపీడీఓ కృష్ణమోహన్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈ సామాజిక సమతా సంకల్ప యాత్రను ఆయన ప్రారంభించారు. కార్యదర్శులు రాజమోహన్, కేవీవీ సత్యనారాయణ, శ్రీనివాస్, కనకమ్మ, సంతోష్, దిలీప్, కిరణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: విజయవాడలో అంబేడ్కర్ స్మృతి వనం ఆవిష్కరణ కార్యక్రమానికి మండలం నుంచి అనేక మంది తరలి వెళ్లారు. జెడ్పీటీసీ సభ్యుడు నేల కిశోర్‌కుమార్, నల్లా నరసింహమూర్తి, నాతి సత్యనారాయణ ఆధ్వర్యంలో దళితులు బస్సుల్లో విజయవాడ వెళ్లారు. మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు గంటి వెంకట సుధాకర్, చల్లగల అప్పారావు, ఇసుకపట్ల శ్రీనుబాబు, సాపే సూర్యప్రకాష్, జనిపెల్లే శ్రీను, వర్షాల చిన్నారావు తదితరులు ఉన్నారు.

తాళ్లరేవు: విజయవాడకు వెళ్లే బస్సులను స్థానిక సుంకరపాలెం జంక్షన్ వద్ద ఎంపీపీ రాయుడు సునీత జెండా ఊపి ప్రారంభించారు. రాయుడు గంగాధర్, కాశి లక్ష్మణస్వామి, వెంటపల్లి నూకరాజు, కోరుకొండ సింహాద్రమ్మ, పి.చినకామేశ్వరరావు, దున్నా శ్రీకాంత్, మోకా మధుబాబు తదితరులు ఉన్నారు.

22న శ్రీరామ జయమంత్ర స్మరణతో ర్యాలీ



అమలాపురంలో ర్యాలీ నిర్వహణపై చర్చిస్తున్న శ్రీరామభక్త బృందం

అమలాపురం టౌన్: అయోధ్యలోని శ్రీరామ మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఈ నెల 22న ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకూ అమలాపురం గడియారం స్తంభం సెంటర్‌లో శ్రీరామ జయ మంత్ర స్మరణ, సీతారామ పట్టాభిషేకం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు స్థానిక శ్రీరామభక్త బృందం తెలిపింది. ఆ రోజు శ్రీరామజయ మంత్ర స్మరణతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహిస్తామని పేర్కొంది. స్థానిక శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి అమ్మవారి కల్యాణ మండపంలో శ్రీరామ భక్త బృందం శుక్రవారం సమావేశమై 22న నిర్వహించే కార్యక్రమాలపై చర్చించింది. ఇదే సందర్భంగా హనుమాన్ చాలీసా పారాయణ ఉంటుందని తెలిపింది. బెల్లం పానకం వితరణతో తొలుత ఈదరపల్లిలోని జనహిత కార్యాలయం నుంచి గడియారం స్తంభం సెంటర్‌కు ర్యాలీగా వస్తామని వివరించింది. అక్కడ నిర్వహించే శ్రీరామ పూజల్లో అంతా పాల్గొని హిందువుల ఐక్యత చాటాలని విజ్ఞప్తి చేసింది. దేశ ప్రధాని మోదీ పిలుపుతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొంది.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తనిఖీ

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను కోనసీమ జిల్లా డీవీఈఓ ఎస్‌వీవీ సత్యనారాయణ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో జరుగుతున్న ప్రీ ఫైనల్ పరీక్షల నిర్వహణను ఆయన తనిఖీ చేసి, ప్రతి తరగతి గదికి వెళ్లి పరిశీలించారు. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ప్రవేశపెట్టిన జయీభవ 50 రోజుల ప్రోగ్రాంకు సంబంధించి ప్రతి అధ్యాపకుడు కొంత మంది విద్యార్థులను దత్తత తీసుకుని, చదివించేలా అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. కళాశాలలో నాడు – నేడు పనులను పరిశీలించారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.

బీసీ కులగణన సర్వే ప్రారంభం



అల్లవరంలో కులగణన సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణమోహన్, కార్యదర్శులు

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణన సర్వే అమలాపురం మున్సిపాలిటీలోని 15 వార్డు సచివాలయాల పరిధిలో శుక్రవారం నుంచి మొదలైంది. ఇందులో ఆయా వార్డు సచివాలయాల కార్యదర్శులు, వలంటీర్లు నిమగ్నమయ్యారు. సర్వే బృందం బీసీ కులగణనకు ఇళ్లకు వెళ్లినప్పుడు దాదాపు 31 ప్రశ్నలు వేసి సమాధానాలు రాబడుతున్నారు. సర్వే పూర్తయ్యాక తొలుత కుటుంబ పెద్ద, తర్వాత వార్డు లేదా గ్రామ సచివాలయ కార్యదర్శి, చివరిగా సంబంధిత ఏరియా వలంటీర్ వేలిముద్ర వేయాల్సి ఉంటుంది. ఈ సర్వేలో ప్రధానంగా కుటుంబ పెద్ద పేరు, ఆధార్ నంబరు, ఇంట్లో కుటుంబ సభ్యుల సంఖ్య, రైస్‌కార్డు నంబరు, ఇంటి కేటగిరీ, తదితర వివరాలు సేకరిస్తున్నారు. సెక్షన్–1 సర్వేలో ప్రస్తుత జీవన స్థితి, జిల్లా, ప్రాంతం, తదితర కోడ్ నంబర్లు, వార్డు, ఇంటి నంబరు తీసుకుంటున్నారు. సెక్షన్–2 సర్వేలో వ్యక్తి లింగం, పుట్టిన తేదీ, వివాహ స్థితి, కులం, ఉప కులం, మతం, విద్యార్హత, వృత్తి, పంట భూమి, నివాస భూమి వివరాలు సేకరిస్తున్నారు.

అల్లవరం: మండలంలోని 23 సచివాలయాల పరిధిలో కుల గణన సర్వేను ప్రారంభించామని ఎంపీడీఓ కృష్ణమోహన్ తెలిపారు. దీనిని ఆయన పరిశీలించారు. ప్రతి ఇంటికి వెళ్లి యాప్‌లో ఉన్న అన్ని వివరాలు తప్పకుండా నమోదు చేయాలని వలంటీర్లకు సూచించారు. కార్యదర్శులు రాజమోహన్, కేవీవీ సత్యనారాయణ, కనకమ్మ, సచివాలయ సిబ్బంది శుభ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో విజేత ఈదరపల్లి



క్రికెట్ పోటీల్లో మండల స్థాయి విజేతగా నిలిచిన ఈదరపల్లి జట్టు

అమలాపురం రూరల్: అమలాపురం మండల స్థాయి 'ఆడుదాం ఆంధ్రా' క్రికెట్ పోటీల్లో ఈదరపల్లి జట్టు విజేతగా నిలిచింది. జీఎంసీ బాలయోగి స్టేడియంలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఏవీ ఆర్‌నగర్ జట్టుపై ఈదరపల్లి జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్‌కు అంపైర్లుగా తోట రవి, బాలాజీ వ్యవహరించారని కో ఆర్డినేటర్ కె.గణేష్, వి.రమణరావు, వై.సంజీవయ్య తెలిపారు.

పూర్వ విద్యార్థుల కలయిక..



మండపేటలో ఒకచోట చేరిన పూర్వ విద్యార్థులు

కపిలేశ్వరపురం (మండపేట): ఆ పాఠశాల పదో తరగతి విద్యార్థులు 39 ఏళ్ల తర్వాత సమావేశమయ్యారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకచోట కలుసుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన సంగతులను ఒకరికొకరు చెప్పుకొంటూ సందడిగా గడిపారు. హృదయం ఉప్పొంగిన వేళ వారి కలయిక ఆనందాల హరివిల్లును తలపించింది. మండపేట పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల 1984–85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు శుక్రవారం సమావేశమయ్యారు. పట్టణంలోని కాపు కల్యాణ మండపంలో సమావేశమైన పూర్వ విద్యార్థులు కుటుంబ సమేతంగా హాజరై సందడి చేశారు. వారి దీర్ఘకాలపు పరిచయాన్ని ప్రతిబింబించేలా గ్రూపు ఫోటో దిగారు. పూర్వ విద్యార్థులు వాద్రేవు శ్రీనివాస్, శెట్టి నాగేశ్వరరావు, యేలేటి వెంకటేశ్వరరావు, కర్రి వెంకటరమణ, దూలం నాగు, మన్యం ప్రసాద్, విజ్ఞాన్ గణేష్, చింతల శ్రీనివాస్, నామాల సత్యనారాయణ, సయ్యద్ రబ్బానీ, అల్తాఫ్, సలాది వెంకట్రావు, పాంద్రంకి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జాన్‌మోసే

మలికిపురం: బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా విశ్వేశ్వరాయపురం గ్రామానికి చెందిన బూసి జాన్‌మోసేను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు కుసుమ వెంకటేశ్వరరావు ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు జాన్ మోసే శుక్రవారం తెలిపారు. జాన్ మోసే మాట్లాడుతూ పార్టీ ఆదేశాల ప్రకారం పని చేస్తానని పేర్కొన్నారు.

గాలికుంటు నివారణకు టీకాలు



పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్లు మూర్తి, విజయరెడ్డి

అమలాపురం టౌన్: జిల్లాలోని పాడి పశువులకు 32వ విడత జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమం చేపడుతున్నట్లు పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ కర్నీడి మూర్తి తెలిపారు. స్థానిక రావులచెరువులో ఆ శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఉచిత పశు వైద్య శిబిరాన్ని శుక్రవారం మూర్తి ప్రారంభించారు. ఈ నెల 2 నుంచి మొదలైన ఈ కార్యక్రమం 31వ తేదీ వరకూ కొనసాగుతుందని డాక్టర్ మూర్తి తెలిపారు. విజయరెడ్డి మాట్లాడుతూ ఈ వ్యాధి వల్ల పాడి పశువుల నోట్లో లేదా కాలి గిట్ట మధ్యలో పుండ్లు ఏర్పడి మేత తినక నీరసించి పోతాయన్నారు. పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుందన్నారు. అమలాపురం ఏరియా పశు వైద్యశాలల పరిధిలో 20 వేల పశువులకు టీకాలు వేస్తున్నామని వివరించారు. దీనికోసం ప్రతి గ్రామంలో ఓ టీమ్ ఏర్పాటు చేశామన్నారు. అనంతరం శిబిరంలో 196 పశువులకు టీకాలు వేశారు. పశు వైద్యాధికారి శివరామకృష్ణ, 1962 పశు అంబులెన్స్ వైద్యాధికారి హెప్సిబా, పశు గణ సహాయకుడు ఎం.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని ఆలయం అభివృద్ధి

అలమూరు: గుమ్మిలేరులోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. దాతల సాయం, రూ.20 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. గ్రామానికి చెందిన దివంగత రెడ్డి వెంకట్రావు భార్య లక్ష్మీకాంతం సంరక్షణలో, పర్యవేక్షణలో ప్రస్తుతం దేవతామూర్తులకు నిత్య పూజలు ధూప దీప నైవేద్యాలు కొనసాగుతున్నాయి. ఆలయ నిర్మాణం జరిగి నాలుగున్నర దశాబ్దాలు పూర్తి కావడంతో ఆలయాభివృద్ధికి ఆమె ప్రత్యేక చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఆమె దాతల సహాయ సహకారాలతో ఆలయం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.